# 'వ్యత్యాసం'

బ్రతకడం – జీవించడం మధ్య కొన్ని యోజనాల దూరం వుంది. మనలో చాలా మందిమి అలా బతికుంటూ కాలాన్ని గడిపేస్తాం. బ్రతకడం అన్నది ప్రాకృతికం చచ్చే వరకూ బ్రతికే ఉంటాం. కానీ జీవించడం అన్నది చాలా గొప్ప గుణం.

మా అమ్మ జీవితంలో నన్ను రెండే రెండు కోరికలు కోరింది. ఒకటి నన్ను కవిగాచూట్టం. రెండు కాశీ చూడాలని. ఇప్పుడు రచయితగా కొద్దో గొప్పో పేరొచ్చినా అది చూట్టానికి అమ్మ లేదు. (అయినా అదేం కోరికో నాకప్పుడు అర్థం కాలేదు. అందరి తల్లులూ తమ కొడుకులు డాక్టర్లూ కలెక్టరూ ఇంజనీర్లూ కావాలనుకుంటారు. మా అమ్మ మాత్రం నన్ను కవిగా చూడాలనేది. ఇదేం పిచ్చి కోరికే అమ్మా అంటే "ఎంత కోటీశ్వరుడైనా పోతూ ఆశను మిగిల్చిపోతాడు కవి మాత్రం అద్భుతమైన అక్షరాలు వదిలి వెళ్తాడు' అనేది.)

ఇక కాశీ మాట... మత విశ్వాసాలు లేని నేను ఆ కోరికను సీరియస్‌గా తీసుకోలేదు. అమ్మ ఆ కోరిక కూడా తీరకుండానే కన్ను మూసింది. అమ్మ పార్థివ కాయానికి దహన సంస్కారాలైం తర్వాత అమ్మ మీది ప్రేమతో విశ్వాసాల కతీతంగా అమ్మ చితాభస్మాన్ని తీసుకుని కాశీకి వెళ్లా... (ఇది ఏనుగుల వీరాస్వామయ్య కాశీయాత్ర కథలాంటిది కాదు. బ్రతకడం జీవించడం మధ్య నున్న వ్యత్యాసాన్ని తెలిపే కథ)

కాశీ ఒక అద్భుత నగరం. అతి పురాతనంగా ఉంటూనే సజీవంగా వున్న నగరం. నేను మతవిశ్వాసాల గురించి కొద్దిగానైనా ఆలోచించింది కాశీలోనే...

కాశీ, వారణాసి... హరిశ్చంద్రఘాట్... బెనారస్ హిందూ యూనివర్సిటీ, ఇరకూ మురికీ... పీనుగులూ... ముండమోపులూ... ఖాట్మండూ నించి తిన్నగా దిగే మత్తూ... బిస్మిల్లాఖాఁ షెహనాయీ గంగ ఒడ్డున గంటల తరబడి కూచున్న జ్ఞాపకం. యెక్కడెక్కడివాళ్లో యే భాషల వాళ్లో తెలీదు అందర్నీ కలిపే ఒకే ఒక మౌనభాష నమ్మకం... అదేనేమో మతం! వేల సంఖ్యలోని జనాల మౌనరోదనల్ని మరింత మౌనంగా ధరించి భరించే మహాస్రోతస్విని గంగ. సరే అమ్మ చితాభస్మాన్ని తీసుకుని పాండా గూండాల చేతికి చిక్కకుండా ఓ చిన్న పడవలో గంగను అటూఇటూ దాటి మధ్యలో 'అమ్మ'ను గంగలో నిమజ్జనం చేసా. సరే వచ్చి ఒడ్డున పాండాల తీరు గమనిస్తూ కూచున్నా. ఓ తెలుగు కుటుంబం వచ్చింది.

శ్రాద్ధ కర్మల్ని ఏమాత్రం శ్రద్ధ లేకుండా ఆ పాండా చేస్తూ కాస్త ఎడంగా నించున్న బక్కచిక్కి ఎముకలు తేలిన ఓ బ్రాహ్మణ్ణి పిలిచాడు "మీ వాడే తెలుగువాడు ఈ దానం అతనికివ్వండి" అన్నాడు. అంతా అయిపోయిం తర్వాత ఆ బక్క బ్రాహ్మణ్ణి వెంబడించా... కొద్దిదూరం వెళ్లిం తర్వాత అతన్ని పిలిచా... ఆగాడాయన. నేనూ తెలుగు వాడినే అన్చెప్పి... "నేనిక్కడ కొద్దిరోజులుండాలనుకుంటున్నాను. నాకు కాస్తా చవగ్గా బసా భోజనం ఏర్పాటు ఏదైనా చేయగలరా" అని ఆయన్ని అడిగాను. ఆయన తన పేరు వెంకటసూరి అన్చెప్పిన గుర్తు. తెనాలి దగ్గర ఏదో పల్లె అన్నాడు వయసులో ఉన్నప్పుడు దారిద్రాన్ని భరించలేక భార్యను తీసుకొని ఒక్కో పుణ్యస్థలంలో ఉంటూ చివరికి వారణాసిలో స్థిరపడ్డట్టూ... చిన్న చిన్న దానాలూ... నిమంత్రణలూ.. (శ్రాద్ధ భోజనాలు) చేసుకుంటూ తనూ తన భార్యా రోజులు వెళ్లదీస్తున్నామని చెబుతూ...నా కభ్యంతరం లేకపోతే బసా భోజనం రెండూ తనింట్లోనే ఏర్పాటు చేస్తాననీ... అందుకు నేనిచ్చే డబ్బు ఆయనకు కొంత సాయంగా ఉంటుందని అన్నాడు. మరీ మంచిదే అని ఆనందిస్తూ ఆయన వెంట వెళ్లాను.

ఆయన ఇల్లు అనబడే ఆవాసం పాతిక కుటుంబాలుండే ఇంట్లో ఒకటిన్నర గది. అందులో అరగది పూర్తిగా నిండిపోయింది. కారణం మధ్యలో ఓ మంచం, ఆ మంచంలో ఓ ఆడమనిషి అనబడే జీవి తాలుకు శిథిలం పడి వుంది.

"నా భార్య... గత పదిహేనుళ్లుగా పూర్తి పక్షవాతం కమ్మి మంచాన ఉంది" అని నన్ను ఇంకో గదిలోకి తీసుకెళ్లి కూచోబెట్టి వెళ్లి ఆమె పాడుచేసుకున్న బట్టలు తీసి, ఆమెను శుభ్రపరిచి కొద్దిగా అన్నం కలిపి చెంచాతో కొద్దికొద్దిగా తినిపించి, నా దగ్గరికి వచ్చి కూచున్నాడు. ఆయన ఆమెకు సేవ చేస్తున్నంతసేపూ గమనిస్తూనే వున్నాను. నవ్వుతూ ఏదో మాట్లాడుతూ ఆమెకు ఏవిధమైన అదనపు కష్టమూ కలగకుండా అతి సున్నితంగా... అదేదో తన బాధ్యత అన్న భావన అస్సలు కనపడకుండా ఆమెకు సేవలు చేసాడు.

నాతో "మీకు యిదంతా ఇబ్బందిగా అనిపిస్తే మీకు వేరే చోటు చూపిస్తాను" అని నిర్మలంగా అన్నారాయన.

ఎంత మనసుకు నచ్చచెప్పుకున్నా ఆ ఇంట్లో ఉండలేక ఆయన చేతికో ఏభై రూపాయలిచ్చి వచ్చేసా. వస్తూ వస్తూ ఆమెనూ అతన్నీ మార్చిమార్చి చూసా....

ఆమె కేవలం బ్రతికి ఉంది.

ఆయన జీవిస్తున్నాడు... ●